వీడ్కోలు

-జి. వెంకట్రామరెడ్డి



పా పార్వతి మనస్సు ఈవేళ సౌంజాగా వుంది. అపుడే వచ్చిన దినపత్రికను తిరగవేస్తోంది. చూస్తూ చూస్తూ ఒకచోట టక్కున ఆగిపోయింది "కన బడుట లేదు" ఒక మూలన చిన్న హెడ్డింగ్ పెట్టి వుంది. దానిక్రింద తప్పిపోయిన అమ్మాయి ఫోటో కూడా వేశారు

"కుమారి సరోజ వయస్సు 8 సం ఎర్రగా బొద్దుగా వుంటుంది రెండునెలల నుండి కనిపించడం లేదు జాడ తెలిసినవారు ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి తగిన బహుమతి కూడా యివ్వబడును." అని వుంది.

ఆ సరోజ, తన సరోజ, ఒకరేనా? ఫోటోను తీవ్రంగా చూసి ఒక నిర్ధారణకు వచ్చింది

తన సరోజ ఫోటోయే అది అందులో సందేహం లేదు.

"అమ్మా సరోజ" అని పిలిచింది

ఇంట్లో కూర్చొని చదువుకుంటున్న సరోజ పరుగెత్తుకుని వచ్చింది.

"ఏమిటమ్మా అంత గట్టిగా పిలిచావ్? నాకు భయమేసింది." అంది పార్వతి దగ్గరగా కూర్చొని

"ఈ ఫోటో నీదికదూ!" అని పత్రిక చేతి కిచ్చింది పార్వతి

"నాదేనమ్మా పోయిన సంవత్సరం మా వూరు ఫోటోలు తీసే మనిషి వస్తే తీయించుకున్నాను అపుడు మా అమ్మానాన్న కూడా తీయించుకున్నారు. అందరూ కలసి ఒకటి, నేను ఒక్కతెను ఒకటి తీయించుకున్నాం. అయితే ఈ పత్రికకు యెలా వచ్చింది? వీళ్ళదగ్గ రేమన్నా మంత్రాలుంటాయా?" అన్నది ఆశ్చర్యంగా

పార్వతి చిరునవ్వు నవ్వి—

"నువ్వు కనిపించడం లేదని మీనాన్న పేపరుతో ఎడ్వర్టైజుమెంటు యిచ్చాడు" అన్నది

"అయితే నువ్వు తెలియజెయ్యకమ్మా. ఇక్కడ నాకు యెంత హాయిగానో వుంది." అన్నది

"నువ్వు వద్దంటుంటే నేను మాత్రం ఎందుకు తెలియజేస్తాను?"

"అమ్మా నిజంగా రాయకు నిన్ను విడిచి వెళ్ళ బుద్ధి కావడంలేదు నాన్న వస్తే లాక్కెడతాడు అయినా ఎక్కడయితేం నేను సుఖంగా వుండడమేగా కావలసింది వాళ్ళకు" అమాయకంగా అడిగింది.

ఆ మాతృ హృదయం ఎంత తల్లడిల్లుతుందో ఈ పసికూనకేం తెలుసు? నిజంగా సరోజ హృదయంలో తను మాతృస్థానం సంపాదించుకుంది తను ఎంత అదృష్టవంతురాలు! ఇంతకంటె ఎవరు యెక్కువ కోరుకుంటారు?

"పిచ్చితల్లి" ఆప్యాయంగా తల నిమురుతూ అన్నది నువ్వు వద్దంటూంటే నేనెందుకు తెలియ జేస్తాను? వెళ్ళి చదువుకో" అన్నది.

"రాయబోకమ్మా' అని లోనికెళ్ళింది సరోజ.

ఇలాంటి అందాల అమ్మాయిని బిడ్డగా కన్న ఆ మాతృశ్రీ ఎంత అదృష్టవంతురాలు!

తెలియజేయడం తన ధర్మం, కర్తవ్యం కూడాను కాగితం కలం తీసుకోక తప్పింది కాదు

"మీ సరోజ సురక్షితంగా వుంది" అని ఈ అడ్రెసు యిచ్చింది పనిమనిషి చేతికిచ్చి పోస్టు చేయమ్మని బరువుగా నిట్టూర్చింది

సరోజతో పరిచయమయిన ఆ విచిత్ర సంఘటన గుర్తుకు రాసాగింది

తను ఆ స్కూలుకు సెకండరీగ్రేడ్ టీచరుగా వచ్చిన కొత్తరోజులు ప్రతి అమ్మాయిని ఆత్మీయురాలిగా చూసుకోవడం వలన తనంటే స్కూల్లో పిల్లలందరికీ యిష్టమే

ఆరోజు ఆదివారం. సాయంత్రం స్కూలుకి సరదాగా వెళ్ళింది

మాసిన బట్టలతో వరండాపై పడుకొని వుంది సరోజ స్కూలు అమ్మాయి గాబోలు, ఆడుకొని అలసిపోయి, యిక్కడ పడుకొంది గాబోలు, సరదాగా నాలుగు కబుర్లు చెప్పి వద్దాం అని దగ్గర కెళ్ళింది.

తను వెళ్ళేసరికి బెదురు బెదురుగా లేచి నిల్చుంది.

"ఏమిటమ్మా యిక్కడ పడుకున్నావ్?" అని ఆప్యాయంగా అడిగింది దగ్గర కెళ్ళి సరోజ బెదురు బెదురుగా తనకేసి చూస్తుందేగాని ఒక్కమాట కూడా మాట్లాడటం లేద .

"ఏమిటమ్మా, అలా చూస్తావ్? యిక్కడ పడుకున్నావేం?" అని ఒడిలోకి తీసుకొని ఆప్యా

యంగా అడిగింది.

"మరండీ." అని యేదో చెప్పబోయి మధ్యలోనే ఆగిపోయింది.

"భయంలేదు చెప్పమ్మా. నిన్ను యేమీ అనముగా" అన్నది తను.

"అమ్మా—నాన్నా— మావూరు." ప్రయత్న పూర్వకంగా మాట పెగల్చుకొని అన్నది. కళ్ళ వెంబడి నీళ్ళు కారుతున్నాయ్. ఆ మట్టి చేతుల్తోనే కళ్ళు తుడుచుకుంటుంది.

"తప్పు అమట్టి చేతుల్తో కళ్ళు తుడుచు కోకు." అని తన పమిట చెంగుతో తుడిచింది. తన వూహ నిజమే అయింది.

"మాయింటి కెడదాంరా. మీ అమ్మా నాన్నను అక్కడ చూపిస్తాను" అన్నది తను. ఇంత ఆప్యా యంగా అన్నా కూడా యింకా బెరుకు బెరుకుగానే చూస్తోంది.

"నేను కొట్టనమ్మా. మీ అమ్మని చూపిస్తాను." అని యింటికి తీసుకువచ్చింది.

ఒకగంట సేపాగిన తర్వాత

"అమ్మని చూపిస్తా నన్నారుగా. ఎక్కడుంది?" అన్నది. ఇపుడు సరోజ ముఖంలో ధైర్యం కొట్ట వచ్చినట్లు కనబడతోంది. తను యేం మాట్లాడక పోవడంతో—

బిగ్గరగా యేడ్చి

"నన్ను చంపుతారు. అమ్మో" అని పారిపో బోయింది. తను గట్టిగా చేయి పట్టుకొని బావి దగ్గరకు తీసికెళ్ళి స్నానం చేయించి తన చెల్లెలుకు కుట్టించిన క్రొత్తబట్టలు యిచ్చింది.

అన్నం తిన్నంతసేపు దగ్గర కూర్చొని మంచి కబుర్లు చెప్పింది. అయినా సరోజ భయం తగ్గలేదు. ఆరాత్రి తన దగ్గరే పడుకోబెట్టుకుంది.

మరునాడు అంత భయం కనిపించలేదు.

సరోజ పడుకున్న మంచం దగ్గర కెళ్ళి—

"అసలేం జరిగిందో చెప్పమ్మా. ఎవరన్నా నిన్ను కొట్టారా? అమ్మ యేమన్నా అన్నదా?" అని అడి గింది. ఆప్యాయంగా.

"మరండీ—మరండీ" అని ఆగిపోయింది.

"చెప్పమ్మా." అన్నది తను మళ్ళీ.

"మొన్న మా అమ్మానాన్నా, నేను శివరాత్రి స్నానానికి వచ్చామండీ. చాలమంది జనం వచ్చారు. అందరూ నీళ్ళల్లో మునుగుతున్నారు. నేను మున గాను. నా ప్రక్కనే నల్గురు పిల్లలుంటే వాళ్ళతో కలిసి కాసేపు ఆడుకున్నాను. కాసేపాగి చూసేసరికి మా అమ్మానాన్నా కనిపించలేదు. అమ్మా, అమ్మా అని పెద్దగా కేకవేశాను. కాని, యెక్కడా కనిపించ లేదు. మధ్యాహ్నం వరకు అలానే తిరిగాను. నేను యేడుస్తూ అమ్మా,-అమ్మా, అనడం ఒకాయన చూసి, నా దగ్గరకు వచ్చాడు. చాల భయపడ్డాను.

మీలాగానే "ఎందుకమ్మా యేడుస్తావ్?" అన్నాడు.

"మా అమ్మా, నాన్నా తప్పిపోయారు. కనిపిం చడంలేదు." అన్నాను.

అతడు నన్ను బుజ్జగించి...

"అందుకేనా యింతగా యేడ్చేది? నేను చూపి స్తాను రా. మీ అమ్మ నాకు బాగా తెలుసు. నిన్ను తీసుకురమ్మన్నారు." అన్నాడు నాకు సంతోషం వచ్చి

"మీరు చాల మంచివారు." అన్నాను. నన్ను యింటికి తీసికెళ్ళి—

"మీ అమ్మా, నాన్నా బజారు కెళ్ళారు వస్తారు." అన్నాడు మళ్ళా నాకు భయమేసింది. గదిలో కూర్చొని చాల చీకటి పడేవరకు అలా చూస్తూనే వున్నాను. కాని వాళ్ళు యెవరూ రాలేదు. భయమేసి,

"మా అమ్మా, నాన్న యెక్కడ?' అన్నాను యేడుస్తూ. "వస్తారులే అన్నం తిందువుగానిరా." నన్ను యింట్లోకి తీసికెళ్ళాడు. అన్నం తినేసరికి నాకు నిద్ర ముంచుకు వచ్చింది.

మరునాడు వుదయం నిద్ర లేచి చూసేసరికి మీ స్కూలు వరండాపై పడుకొని వున్నాను. మెళ్ళో చూసుకుంటే నా నెక్లెస్ లేదు. బాగా ఆకలి అవు తుంది. ప్రతిరోజు మా యింటి దగ్గర వుదయాన్నే కాఫీ త్రాగే అలవాటు. నెక్లెస్ పోయిందని అమ్మ కొడుతుందేమోనని యేడుస్తూ వరండాలోనే కూర్చుండిపోయాను. అంతలో మామిడి పండ్లు అమ్ముతూ ఓ అవ్వ వచ్చింది. నా సంగతంతా విని రెండు పండ్లు యిచ్చింది. అవి తిని మీ స్కూల్లో వున్న పంపు దగ్గర నీళ్ళు త్రాగాను. కొంచెం కళ్ళు తిరగడం తగ్గింది. అమ్మా నాన్నను వెతుకుతూ రోడ్లన్నీ తిరిగాను. కాని వాళ్ళు యెక్కడా కనిపించ లేదు. తిరిగితిరిగి కాళ్ళునొప్పులు పుడుతుంటే మళ్ళా వచ్చి వరండాలో పడుకున్నాను. ఈరాత్రి ఒక్కదాన్నీ యెలాగ వుండాలా? అని భయమేసింది. ప్రొద్దు కూకుతున్న కొద్దీ భయమెక్కువయింది. ఒక అమ్మలాగా మీరు కలిశారు." అని తన వొడిలో తల దూర్చి వెక్కివెక్కి యేడ్వడం మొదలెట్టింది.

"ఏడ్వకు సరోజా, నేను కలిశాగా." అన్నది తను.

"ఆ నెక్లెస్ మా తాతయ్య పెట్టాడు."

"పోతే పోయిందిలే వెధవ నెక్లెస్. ఇంకొకటి చేయించుకోవచ్చు. విచారం పెట్టుకోకు." అని బుజ్జగించింది.

మండిపోతున్న ఆ పసి హృదయంలో తన మాటలు అమృతం పోసినట్లున్నాయ్.

"అంతేలెండి." అన్నది చిరునవ్వుతో. పైనున్న యేదో బరువు దించినట్లుగా వుంది తనకు.

అప్పటి నుండి భయం తగ్గి రోజురోజుకి తన దగ్గిరవుతోంది. తనతోపాటు స్కూలుకు తీసు కెడుతూ వుండేది.

ఉన్నట్లుండి ఒకరోజు అకస్మాత్తుగా జ్వరం వచ్చింది.

అబ్బ! అపుడు తను ఎంత కంగారుపడింది! ఉండి వుండి—

"అమ్మా, నా గొలుసు. ఆయన తీసుకున్నాడు." అని పలవరిస్తోంది. ఆ మూడురోజులు సెలవు పెట్టి సరోజ మంచం దగ్గరే కళ్ళల్లో వత్తులు వేసుకొని మరీ మేల్కొని వుంది. రోజుకు రెండుసార్లు డాక్టరును తీసుకువచ్చి చూయించేది.

అదృష్టవశాత్తు ఆ జ్వరం త్వరలోనే తగ్గి పోయింది. తమ మధ్య అనురాగాన్ని యింకొంచెం పెంచింది ఆ జ్వరం. అప్పటినుంచి, తను యెటు వెళ్ళినా కొంగు పట్టుకొని మరీ తిరుగుతూ వుండేది.

ఓ చక్కటి అమ్మాయి తనతో తిరుగుతుంది అని ఎంత మురిసిపోయేది తను! తను ఆ అమ్మాయికి తల్లి అయినట్లే గర్వపడేది!

ఆరోజు తొలిసారిగా.. నిజంగా జీవితంలో మరువ లేని రోజు.

"అమ్మా ఈ పువ్వులు జడలో పెట్టు. నువ్వు చాల అందంగా పూలు పెట్టుకుంటావమ్మా" అన్నది. ఆరోజు...తనకొక మహత్తరమయిన పండుగరోజు! ఒక అమ్మాయి నోటి వెంట తను అమ్మా అనిపించు కుంది.

"సరోజా." అని గట్టిగా కౌగిలించుకుంది. తన కనుకొలకుల్లో నీటి బిందువులు నాట్యం చేశాయ్ మరుక్షణాన్నే.

"ఎందుకమ్మా, యేడుస్తావ్? మీ అమ్మా, నాన్న గుర్తుకు వచ్చారా?" అంది పసంత ఆప్యాయంగా.

"అదేం కాదమ్మా." అని మాట మార్చాలనే వుద్దేశ్యంతో "పూలు పెడతాను వుండు." అని పూలు పెట్టింది.

ఆ రోజంతా సరోజ అందాన్ని చూస్తూనే, గడిపింది. ఇలాంటి తీయటి బంధం పెనవేసుకుంది తనకు, సరోజకు మధ్య—

పార్వతి ఆలోచనలను భగ్నం చేస్తూ.

"అమ్మా ఏమిటలా ఆలోచిస్తున్నావ్? వుత్తరం సంగతేనా! ఇపుడొద్దులే నేను సుఖంగానే వున్నాగా" అన్నది దగ్గరగా వచ్చి.

"నిజంగా నీకు వెళ్ళ బుద్ధి కావడంలేదా సరూ!" అన్నది పార్వతి ఆత్రుతగా.

"నిజం అమ్మా. కావాలంటే యింకో పదిరోజుల తర్వాత వెడతాను." అన్నది.

"సరేలే నేనెందుకు తొలియజేస్తా?" అనక తప్పిందికాదు పార్వతికి.

"నువ్వు చాల మంచిదానవమ్మా. మా అమ్మ కూడా నన్నింత ఆప్యాయంగా పెంచేదికాదు." అన్నది మెడ చుట్టూ చేతులు వేస్తూ—

'ఆ పసి హృదయంలో యెంత అనురాగం! కోపా లకు, తాపాలకు, దూషణాలకు భూషణాలకు ఆ పసి హృదయం ఎంత దూరంలో వుంది. నిజంగా యిలాంటి అమ్మాయి తనను అమ్మగా భావించడం పూర్వజన్మ సుకృతమే.' అనుకుంటుంది పార్వతి.

"వెళ్ళి బట్టలు మార్చుకుని స్కూలు కెడదాం." అన్నది మరీ మాట్లాడకూడదనే వుద్దేశ్యంతో.

" ఓ నిముషంలో వేసుకుంటాను." అని పరు గెత్తుకుని వెళ్ళింది యింట్లోకి. గుమ్మం కేసి చూస్తూ అలానే కూర్చుండిపోయింది పార్వతి.

*   *   *

పార్వతి అనుకున్న విధంగానే ఆరోజు సరోజ నాన్న వచ్చాడు.

"అమ్మా! పార్వతమ్మగారట! స్కూలు టీచరు, యిల్లు యిదేనా?" అన్నాడు.

"ఇదే రండి. ఎవరు కావాలి?" అన్నది పార్వతి.

"మా సరోజ మీ దగ్గరనేనా అమ్మా వుండేది?" అన్నాడు.

"అవునండి. ఇక్కడే వుంది. లోనికిరండి." అని ఛైర్ వేసింది. మర్యాదపూర్వకంగా.

"మంచినీళ్ళు త్రాగుతారా?" అన్నది. కాని అవన్నీ యేం పట్టించుకునేటట్లు లేడు ఆ మహాను భావుడు.

"ముందు అమ్మాయిని చూపించమ్మా. దాన్ని చూస్తే దప్పిక దానంతటకదే తీరుతుంది. రెణ్నెళ్ల యింది మాతల్లిని చూడక." అన్నాడు.

పార్వతి వెళ్ళేసరికి బావి దగ్గర గన్నేరు పూలు

కోస్తోంది సరోజ.

"సరూ! నీకో మాంచి ప్రజంటేషను. చెప్పుకో చూద్దాం" అన్నది.

పూలు కోయడం ఆపుచేసి—

"నాకు తెలుసులే ఇవ్వాళ నా కోసం మిఠాయిలు చేశావు గదా!" అన్నది.

"లేదు మీ నాన్నగారు వచ్చారు. ఇంటి ముందు వున్నారు వెళ్ళు." అన్నదేకాని, హృదయంలో యేదో మూగ బాధ ఆవరించింది.

'నాన్న వచ్చారు' అని చెవిన బడడమే ఆలస్యం— రివ్వున దూసుకెళ్ళి తండ్రిని కౌగిలించుకుంది.

"బావున్నావా తల్లీ? మళ్ళా ఈ జన్మలో నిన్ను చూస్తామని అనుకోలేదు. అంతా భగవంతుడి దయ" అన్నాడు తల విసురుతూ.

"భగవంతుడి దయకాదునాన్నా. అమ్మ దయ. పార్వతిగారు చాలా మంచివారునాన్నా." అంది.

పార్వతి కూడా గుమ్మందగ్గరగా వచ్చింది.

"నీ ఋణం ఎన్ని జన్మలకయినా తీర్చుకో లేము తల్లీ. ఒక్కతేపిల్ల. అల్లారు ముద్దుగా పెంచాము. శివరాత్రి స్నానానికి వచ్చినపుడు తప్పి పోయింది. అప్పటినుంచి ఒకటే దిగులుతో మంచం యెక్కింది తల్లి." అన్నాడు.

పార్వతి చిరునవ్వుతో పరి పెట్టుకుని లోని కెళ్ళింది కాఫీ తయారుచేయడానికి.

పార్వతికి పొంగి వస్తోంది దుఃఖం. ఏదో అనిర్వచనీయముగ బాధ చిత్రహింస చేస్తోంది. వెలుపల తండ్రీ బిడ్డా మాట్లాడుకునే సంభాషణ స్పష్టంగా వినపస్తోంది:

"అమ్మా, ఆ రోజు యెంతగా యేడ్చావ్ తల్లీ? నీకోసం పట్నమంతా గాలించాం మూడురోజులు. మీ అమ్మయితే ఒకటే శోకాలు."

"ఏమో నాన్నా— అవన్నీ చెప్పకు. భయ మేస్తోంది." అంటోంది సరోజ.

అపుడు చూశాడు ఆయన సరోజమెడకేసి.

ప్రి ద్రోహాలు

బోసి కొడుతోంది.

"నీ నెక్లెస్ యేది? పార్వతమ్మ దాచిపెట్టిందా?" అన్నాడు కంగారుగా.

"లేదునాన్నా. పోయింది. ఎవరో దొంగకొట్టే శాడు." అంది సరోజ బిక్కముఖంవేసి.

"నీకు తెలియదా? అయినా ఈ పంతులమ్మ లాంటి వాళ్లను నమ్మగూడదమ్మా— పిల్లలను అమ్ముకుంటారట. ఆవిడగనక తీసుకొని అమ్ము కుందా? చెప్పు. పోలీసులను పిలుస్తాను." అన్నాడు.

"అబద్ధంనాన్నా. అమ్మను అలా అంటే కళ్ళు పోతాయ్. అమ్మ చాలమంచిది." అంది సరోజ.

ఈ మాటలన్నీ వంటగదిలో వున్న పార్వతికి స్పష్టంగా వినిపిస్తున్నాయ్. కాళ్ళక్రింద భూమి గిర్రున తిరిగినట్లయింది. ఇన్నాళ్ళు కంటిలో పాపగా కాపాడినందుకు అతడు యిచ్చే ప్రతిఫల మిదా? సుళ్ళు సుళ్ళుగా తిరిగివస్తున్న కన్నీటి నాపుకొని కాఫీ కలిపింది.

తండ్రీ బిడ్డా యింకా మాట్లాడుతూనేవున్నారు. "ఏమో అమ్మా— ఏ పుట్టలో యే పామువుందో— నమ్మడం యెలాతల్లీ? ఈ పంతులమ్మ తియ్య లేదని నీకు ఖచ్చితంగా తెలుసా?" అన్నాడు.

"నాన్నా." కొంచెం గట్టిగా అన్నది సరోజ. "అమ్మను అలా అనకు. చాల మంచిది!"

"అడ్డమయిన వాళ్ళందర్నీ అమ్మ అంటావేం తల్లీ? నా అనుమానం ఈ పంతులమ్మే కొట్టేసి వుంటుందని." అన్నాడు.

కాఫీ పట్టుకువస్తున్న పార్వతి చేతిలోని కప్పు జారి క్రిందబడి ఫెల్‌మని పగిలిపోయింది. కాఫీ చీరెమీద పడ్డాయ్. ఈ శబ్దం వినిపించి సరోజ పరుగెత్తుకుని వచ్చింది.

"ఏమిటమ్మా? కప్పు యెలా జారిపోయింది? కన్నీళ్ళు పెట్టుకుంటూ వెందుకమ్మా? స్టౌ జ్ చెప్పవా అమ్మా. ప్రాణం బావుండలేదా?" ఆ పసిహృదయం తల్లడిల్లిపోతోంది పార్వతి దీనావస్థ చూసి.

"నిన్ను ఈ రెండు నెలలు కంటిలో పాపగా చూసుకోబట్టే నాకీ కన్నీళ్ళు. మీరంతా పాప గాళ్ళు." అనాలనిపించింది పార్వతికి కానీ! అభం శుభం తెలియని పసికందును అంటే యేమొస్తుంది?

"లేదమ్మా. కళ్ళు తిరిగాయ్. ప్రాణం బాగానే వుంది. కాఫీ చేసుకువస్తాను. మీ నాన్నగారి దగ్గర కెళ్ళు." అన్నది.

ఎలాగో కాఫీ తయారుచేసి యివ్వక తప్పింది కాదు. చూస్తూనే సాయంత్రం అయింది. జీవితంలో యేనాడూ యెరగని బాధ అనుభవిస్తోంది పార్వతి. గన్నేరు చెట్టు క్రింద వున్న సిమెంటు బెంచీపై కూర్చుంది.

ప్రాణప్రదంగా, కన్నబిడ్డకంటే మిన్నగా పెంచి నందుకు అతడుయిలామాటలతో చిత్రహింసచేస్తాడా?

సరోజ వెడితే యింక రేపటినుంచి తనను అమ్మా అని పిలిచేదెవరు?

జీవితంలో యేదో లోటు పూర్తి అయిందనుకొని సంతోషపడింది. కానీ— రెణ్నెల్లల్లోనే యిలా జరుగుతుందనుకోలేదు. అవును— సరోజ యేనాటి కయినా పుట్టింటి కెళ్ళక తప్పుతుందా? అసలు సరోజమీద అనురాగం పెంచుకోవడం తనదేతప్పు. ఈ పరిచయం కలగకపోతే యే దిగులూ వుండేది కాదు కదా!

అన్నిటికీ మించి ఆయన నోటి వెంట వినరాని మాటలు— భగవాన్! పార్వతి హృదయం తల్లడిల్లుతోంది.

వెళ్ళడానికి తయారయి పార్వతి దగ్గరకు వచ్చింది సరోజ

"ఏమిటమ్మా యిక్కడ కూర్చున్నావ్? ఇంటి ముందుకి రావమ్మా." అన్నది చేయిపట్టుకొని.

విచారంగా సరోజ ముఖంలోకి చూసింది. "ఏమిటమ్మా అలా చూస్తావ్? రా." అంది.

మొన్న సరోజ మాటలకు, యిపుడు మాటలకు యెంతతేడా? తను అనవసరంగా ఆత్మీయత పెంచు కుని యిపుడు తల్లడిల్లితే మాత్రం యేంలాభం?

సరోజతోపాటు, ముందు వరండాలోనికొచ్చింది. సరోజనాన్న రిక్షా పిలవడానికి వెళ్ళాడు.

"నన్ను మర్చిపోవుగదూ సరూ!" హృదయానికి గాఢంగా హత్తుకుని కన్నీళ్ళు పెట్టింది.

మర్చిపోనన్నట్లు తల ఆడించింది సరోజ.

"రా, సరూ! బండి సిద్ధమయింది." రోడ్డుపై నుండి పిలిచాడు తండ్రి.

"వస్తాను అమ్మా." అని నవ్వుతూ రిక్షా దగ్గర కెళ్ళింది. పొరబాటునయినా కన్నీళ్ళు పెట్టలేదు సరోజ. పార్వతికి హృదయంపై యెవరో మోది నట్లయింది.

రిక్షా యెక్కిన సరోజ చేయిపూపింది.

పార్వతి కూడా యాంత్రికంగా చెయ్యూపింది గాలిలో—

అంత బరువయిన రిక్షా పార్వతి గుండెలమీదుగా కదిలింది.

వేగంగా పోతున్న రిక్షాకేసి, రెండు సజలపూరిత నేత్రాలు రెప్పవాల్చకుండా అలా చూస్తూనే వున్నాయ్—